# శ్రీ సయ్యద్ రహ్మత్ అలీ

శ్రీ సయ్యద్ రహ్మత్ అలీ ఐదవ శాసనసభ (1972-1978) డెప్యూటీ స్పీకరుగా 1974, మార్చి 26న ఏకగ్రీవంగా ఎన్నికై 1978, మార్చి 1 వరకు ఆ పదవిని నిర్వహించారు.

వీరు హైదరాబాదు పట్టణంలో 1930, నవంబరు 23న జన్మించారు. మున్షీ ఫాజిల్ విద్యను అభ్యసించారు.

శ్రీ రహ్మత్ అలీ ఉస్మానియా విశ్వవిద్యాలయం సెనేట్ మెంబర్‌గా, వక్ఫ్‌బోర్డు అధ్యక్షునిగా పనిచేసినారు. 1964 వ సంవత్సరంలో హైదరాబాదు మున్సిపల్ కార్పొరేషన్ సభ్యునిగా ఉన్నారు. 1965 వ సంవత్సరంలో డిప్యూటి మేయరుగా ఎన్నికైనారు. కొంత కాలం హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటి ఛైర్మన్‌గా ఉన్నారు.

వీరు 1972 వ సంవత్సరంలో జరిగిన ఎన్నికలలో హైదరాబాదు నగరంలోని ఆసిఫ్‌నగర్ నియోజకవర్గం నుండి శాసన సభకు ఎన్నికయినారు. వీరు డెప్యూటీ స్పీకర్ హోదాలో అర్జీల, విశేషాధికారముల కమిటీల అధ్యక్షులుగా పనిచేశారు.

## శ్రీ సయ్యద్ రహ్మత్ అలీ డెప్యూటీ స్పీకరుగా ఎన్నికైన సందర్భంగా చేసిన ప్రసంగం

అధ్యక్షా, ఈ రోజు నన్ను ఏకగ్రీవంగా డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నుకొన్నందుకు సభ్యులందరికి నా హృదయపూర్వక కృతజ్ఞత తెలుపుకొంటున్నాను. నన్ను డిప్యూటీగా ఎన్నుకొని ఈ ఆదర్శవంతమైన సభకు సేవచేయడానికి నాకు ఈ అవకాశము యిచ్చినందుకు మీ అందరికి, ముఖ్యంగా ముఖ్యమంత్రిగారికి, నా హృదయపూర్వక అభివందనములు. ఈ సభలో మంచి పద్ధతులను, ఆదర్శవంతమైన సాంప్రదాయాలను స్థాపించిన స్పీకరు రంగారెడ్డి గారి క్రింద నేను డిప్యూటీగా పనిచేయడం నా అదృష్టమని భావిస్తున్నాను. నాకు తెలుగు బాగా రాకుండినా, మీ ప్రేమ, సహకారముతో ఏ లోటు రాకుండా ఈ సభకు పక్షపాతము లేకుండా హృదయపూర్వకంగా సేవ చేస్తానని మీకు హామీ యిస్తున్నాను.